సాక్షి శ్రీకాకుళం

గురువారం । 20 । ఏప్రిల్ । 2023



స్కూల్ ఆటో బోల్తా

కొత్తూరు మండలంలో స్కూల్ ఆటో బోల్తా పడింది. ఐదుగురు గాయపడ్డారు.

- 8లో



అంకితభావంతో పనిచేయాలి

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు జిల్లాలో పర్యటించారు. వైద్య విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

- 8లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	41°	25°
ఇచ్ఛాపురం	41°	24°
పాతపట్నం	40°	25°
శ్రీకాకుళం	40°	24°

రంజాన్ వేళలు

ఇఫ్తార్ గురు (సా॥)	సహర్ శుక్ర (ఉ॥)
6.16	4.14



వేదికపై సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, అంబటి రాంబాబు, గుడివాడ అమర్‌నాథ్, జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, పాలవలస విక్రాంత్, వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, కంబాల జోగులు, రెడ్డి శాంతి, కళావతి, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, కార్పొరేషన్ల చైర్మన్లు పేరాడ తిలక్, అంధవరపు సూరిబాబు, శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, కాయల వెంకటరెడ్డి, జేసీ నవీన్, సబ్ కలెక్టర్ రాహుల్ తదితరులు

సీఎం మీటింగ్ సైడ్‌లైట్స్

నందిగాం/టెక్కలి రూరల్: సంతబొమ్మాళి మండలం తీర ప్రాంతానికి 34 ఏళ్ల తర్వాత హెలికాప్టర్‌లో ముఖ్యమంత్రి రావడంతో స్థానికులు హెలీప్యాడ్ వద్ద సందడి చేశారు.

- జ్యోతి ప్రజ్వలన సమయంలో మహిళా నేతలు పిరియా విజయ, వరుదు కళ్యాణి, రెడ్డి శాంతి, కళావతి, కిల్లి కృపారాణి, దువ్వాడ వాణిలు జ్యోతులను వెలిగించారు.
- వైఎస్ విజయమ్మకు బర్త్‌డే విషెస్ చెబుతూ సభలో కొందరు ప్లకార్డులను ప్రదర్శించారు.
- జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో వాటర్ బాటిల్‌లో ఓఆర్ఎస్ ద్రావణాన్ని కలిపి ఇవ్వడంతో ఎండ తీవ్రత నుంచి ఉపశమనం లభించింది.
- సీఎం సభా వేదిక వద్ద కూరగాయలు, పండ్లు తదితర ఉద్యానవన పంటలతో పోర్టు నమూనాను రూపొందించారు. ఇది ఆహూతులను ఎంతగానో ఆకట్టుకుంది.
- సంతబొమ్మాళి మండలం జగన్నాథపురానికి చెందిన ధర్మవరపు పూర్ణాచారి పడవలో వైఎస్ రాజశేఖరరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డిలు కలిసి ఉన్నట్లుగా టేకు కర్రతో ఓ ఆకృతిని తయారు చేసి సీఎం జగన్‌కు బహూకరించడం సభలో ప్రత్యేకంగా కనిపించింది.





ప్రజలకు సీఎం వైఎస్ జగన్ అభివాదం

సువర్ణ స్వప్నం ఇన్నేళ్లకు సాకారం

అన్నీ దశాబ్దాలుగా ఊరిస్తున్న కలలే.. ఈడేరని ఆశలే. వాటన్నింటినీ ఒకేసారి సాకారం చేసి మురిపించారు సీఎం వైఎస్ జగన్. సువర్ణాధ్యాయానికి పునాది వేశారు. సిక్కోలుకు బంగారు భవిష్యత్తు కల్పించే మూలపేట పోర్టు, హిరమండలం ఎత్తిపోతల, ఆఫ్ షోర్, బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి.. మరో రెండు వరాలు కూడా ప్రకటించారు. ఉద్దానం తాగునీటి పథకానికి రూ.265 కోట్లతో పాతపట్నం నియోజకవర్గానికి విస్తరిస్తామని, సంతబొమ్మాళి మండలంలో రూ.70 కోట్లతో తాగునీటి పథకం నిర్మిస్తామని ప్రకటించారు. వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేట వద్ద నిర్మాణంలో ఉన్న జెట్టీని ఫిషింగ్ హార్బర్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇందుకోసం రూ.85 కోట్లు కేటాయిస్తున్నట్లుగా ప్రకటించారు. ఇప్పటికే చేపట్టిన పలు అభివృద్ధి పనులను జూన్‌లో ప్రారంభిస్తామని ప్రకటించడం ద్వారా జిల్లా ప్రగతి విషయంలో తన నిబద్ధతను, చిత్తశుద్ధిని చాటుకున్నారు.

- సిక్కోలు చరిత్రలో కొత్త అధ్యాయం
- మూలపేట పోర్టు నిర్మాణానికి సీఎం వైఎస్ జగన్ శంకుస్థాపన
- వంశధారపై లిఫ్ట్ ఇరిగేషన్, బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్‌కు కూడా..
- ఆఫ్‌షోర్ పనులకు పునరుత్తేజం
- సీఎం వైఎస్ జగన్ చొరవతో సిక్కోలు భవిత భద్రం



గంగమ్మ తల్లి పూజలో..



అభిమాని ఉత్సాహం..



బహిరంగ సభకు తరలివచ్చిన జనం

నరసన్నపేట/అరసవల్లి/టెక్కలి/నందిగాం/కోటబొమ్మాళి/సంతబొమ్మాళి/టెక్కలి రూరల్/శ్రీకాకుళం(పీఎన్ కాలనీ):సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాకతో సిక్కోలు సంబరపడింది. ఎన్నో ఏళ్లుగా కలగా మిగిలిపోయిన ప్రాజెక్టులకు బుధవారం శంకుస్థాపన జరగడంతో జిల్లా యావత్తూ ఉద్వేగంగా గడిపింది. హామీలు ఇచ్చి మర్చిపోయే నాయకులు మాత్రమే తెలిసిన జనాలకు.. సీఎం వైఎస్ జగన్ ప్రత్యేకంగా కనిపించారు. ప్రభుత్వం ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం సీఎం ఉదయం మూలపేటకు చేరుకున్నారు. అక్కడ గంగమ్మ తల్లికి పూజలు చేశా రు. చీర, సారెతో పాటు పసుపు, కుంకుమలు సమర్పించారు. అనంతరం పోర్టు శంకుస్థాపన పైలాన్ ను ఆవిష్కరించారు. ఆ తర్వాత నౌపడ వద్ద ఏర్పా టు చేసిన బహిరంగ సభకు చేరుకున్నారు. ఆ సభా ప్రాంగణం వద్దనే నిర్వాసితుల కాలనీకి శంకుస్థాప న చేశారు. అలాగే వంశధార ఎత్తిపోతల పథకం నిర్మాణానికి, ఎచ్చెర్ల మండలం బుడగట్ల పాలెం వద్ద ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేశారు. దీంతోపాటు మహేంద్ర తనయ ఆఫ్‌షోర్ రిజర్వాయర్ అసంపూర్తి పనుల పునఃప్రారంభానికి శ్రీకారం చుట్టారు. మండిపోతున్న ఎండను సైతం లెక్క చేయకుండా జనం తండోపతండాలుగా తరలివచ్చారు. మూలపేట పోర్టు శంకుస్థాపనతో తీర ప్రాంత గ్రామాలన్నీ పులకరించిపోయాయి. ఇప్పటి వరకూ ఎన్నో ప్రభుత్వాలు వచ్చినా అందరూ మాటలు చెప్పారే తప్ప తమ అభివృద్ధికి చర్యలు తీసుకున్న సీఎం వైఎస్ జగన్ మాత్రమేనని వారంతా ఆనందం వ్యక్తం చేశారు.

పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం..

సీఎం సభకు జిల్లా వ్యాప్తంగా కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. ముఖ్యమంత్రి సభా ప్రాంగణానికి వచ్చే సరికి కార్యకర్తలు, మహిళలతో ప్రాంగణం కిటకిటలాడింది. అలాగే ముఖ్యమంత్రి ప్రసంగం ఆద్యంతం ఉత్తేజంగా సాగడంతో కార్యకర్తల్లో ఉత్సాహం కనిపించింది. సీఎం మాట్లాడుతున్నంత సేపు ఆయనకు జేజేలు కొడుతూ ప్లకార్డులు ప్రదర్శించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సభ లో టెక్కలి నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను సీఎం ప్రకటించడంతో కార్యకర్తలు హర్షధ్వానాలతో తమ ఆనందం తెలిపారు.

260 మందితో..

సీఎం దృష్టికి తమ ప్రాంత సమస్యలు తెలియజేసేందుకు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 260 మందికి పైగా ప్రధాన నాయకులతో సీఎం ఓర్పుగా మాట్లాడారు. వారి సమస్యలు విన్నారు. గంటకుపైగా సమ యం సీఎం స్థానిక నాయకులను కలిసేందుకు కేటాయించడంతో వారంతా ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి సభా ప్రాంగణం అంతా జన సందోహం కనిపించింది. పలాస, వజ్రపుకొత్తూరు, నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోటతో పాటు పాతపట్నం, హిరమండలం, మెళియాపుట్టి, నందిగాం, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల నుంచి అధికంగా ప్రజలు తరలివచ్చారు. వీరికి ఎలాంటి ఇబ్బంది లేకుండా పార్టీ నాయకులు ఏర్పాట్లు చేశారు. సభా వేదిక ముందు ఉద్యానవన శాఖ ఏర్పాటు చేసిన పోర్టు నమూనా చిత్రం ఆకట్టుకుంది. అలాగే సీఎం రాకముందు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, మూలపేట పోర్టు నిర్మాణానికి సంబంధించి కలెక్టర్ తయారు చేసిన వీడియో అలరించింది. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సీఎం కార్యక్రమం కొనసాగింది.



వృద్ధురాలి అభిమానం

ఘన స్వాగతం

ఉదయం 10:14 గంటలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక హెలీకాప్టర్‌లో మూలపేట చేరుకున్నారు. సీఎం వైఎస్ జగన్‌తో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, సీఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.ధనుంజయ్‌రెడ్డి, పరిశ్రమల మౌలిక వసతుల కల్పన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికల్ వలవేన్ తదితరులు ఉన్నారు. వీరికి స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, వరుదు కళ్యాణి, పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాసు, రెడ్డి శాంతి, గొర్లె కిరణ్, మారీటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, ఇచ్ఛాపురం నియోజకవర్గ పార్టీ సమన్వయ కర్త పిరియా సాయిరాజ్, మూలపేట సర్పంచ్ జీరు బాబురావు వైస్ ఎంపీపీ నక్క చింతామణి, సంతబొమ్మాళి, టెక్కలి, నందిగాం జెడ్పీటీసీలు పాల వసంత్ రెడ్డి, దువ్వాడ వాణి, పేరాడ భార్గవి, పీఏసీఎస్ అధ్యక్షుడు కెల్లి గోవింద్, నాయకులు కె.రామ్మోహన్ రావు, వై.ధనుంజయ్, కె.పూర్ణచంద్రరావు, చింతాడ మంజు తదితరులు స్వాగతం పలికారు.

నవచరితకు శ్రీకారం

- రూ.4361.91 కోట్ల వ్యయంతో మూలపేట పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.
- నిర్వాసితులకు నౌపడ వద్ద పునరావాస కాలనీకి గాను 58 ఎకరాల్లో మొత్తం 594 మంది నిర్వాసితులకు ఒక్కొక్కరికి 5 సెంట్లు చొప్పున ఇంటి స్థలాన్ని ఇచ్చేందుకు గాను రూ.34.98 కోట్లతో పనులు ప్రారంభానికి శంకుస్థాపన జరిగింది.
- ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో రూ.365.81 కోట్లతో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఇందుకోసం 48.48 ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించారు. స్థానికంగా వేలాది మంది మత్స్యకారులు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లే పరిస్థితులు తగ్గనున్నాయి.
- టెక్కలి, పాతపట్నం, పలాస నియోజకవర్గాల రైతుల సాగునీటి అవసరాలకు మహేంద్రతనయ నదిపై ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనుల పునఃప్రారంభానికి రూ.400 కోట్లు మంజూరు చేస్తున్నట్లు సీఎం నిర్ణయించారు.
- వంశధార ప్రాజెక్టు రెండోదశలో భాగంగా 19 టీఎంసీల సామర్థ్యంతో ఎత్తిపోతల పథకం నిర్మాణం కోసం రూ.176.35 కోట్లతో గొట్టా బ్యారేజి వద్ద ఎత్తిపోతల పథకం నిర్మాణం కోసం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.



'ఎత్తిపోతల'కు భూమిపూజ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

హిరమండలం: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జిల్లావాసులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. వంశధార ఎత్తిపోతల పథకం పనులకు ఆమె బుధవారం భూమి పూజ చేశారు. నౌపడలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వర్చువల్‌గా శంకుస్థాపన నిర్వహించిన కార్యక్రమాన్ని స్థానికంగా లైవ్‌లో వీక్షించారు. వంశధార జలాలు పొలాలకు మళ్లిస్తానని ఆయన హామీ ఇచ్చారని, ఆ మేరకు ఎత్తిపోతల పథకానికి రూ.176.35 కోట్లు మంజూరు చేశారని అన్నారు. ఈ పనులు ఆగస్టు నాటికి పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే దాదాపు 2.50 లక్షల ఎకరాల భూములకు సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. నాడు తండ్రి రాజశేఖర్ రెడ్డి వంశధార ఫేజ్–1 రిజర్వాయర్‌కు అంకురార్పణ చేయగా.. నేడు కుమారుడు ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి దానికి సార్థకత చేకూర్చుతున్నారని అన్నారు. పాతపట్నం నియోజకవర్గంలోని హిరమండలం, పాతపట్నం, మెళియాపుట్టి మండలాల ప్రజలకు తాగునీరు అందించేందుకు రూ.265 కోట్లు మంజూరు చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో వంశధార ఈఈలు ఎంవీ రమణ, త్రినాథ్, గోపాలకృష్ణ, అప్పలనాయుడు, డీఈఈలు రవికాంత్ సతీష్, ప్రభాకర్‌రావు, ఎంపీడీఓ బి.శైలజ, ఎంఈఓ రాంబాబు ఏపీఎం వి.శ్రీరామచంద్రమూర్తి, ఏపీఓలు శ్రీనివాస రావు, శ్రీదేవి, మండల వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మీసాల వెంకట రామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏపీ సురేష్, మేజర్ పంచాయతీ సర్పంచ్ డి.సుందరమ్మ, ఉప సర్పంచ్ వి.బాలరాజు, ఎంపీటీసీ సభ్యులు మీసాల రజినీ, వి.చిన్నారావు, లుకలాపు ప్రసాద్ శ్రీనివాసరావు, ఎల్ఎన్‌పేట ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, కొత్తూరు, ఎల్ఎన్‌పేట పీఏసీఎస్ అధ్యక్షులు సూర్యనారాయణ, కొల్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'ఫిషింగ్ హార్బర్ ఈ ప్రాంతానికి వరం'



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: ఫిషింగ్ హార్బర్ ఈ ప్రాంతానికి వరంలాంటిదని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. బుడగుట్లపాలెం ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నౌపడ నుంచి వర్చువల్‌గా బుధవారం శంకుస్థాపన చేయగా.. ఎల్ఈడీ స్క్రీన్‌పై బుడగుట్లపాలెంలో ఈ కార్యక్రమాన్ని లైవ్‌లో ప్రదర్శించారు. అనంతరం స్థానికంగా సమావేశం నిర్వహించి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం భూమిపూజ చేసి ఎంపీ మాట్లాడారు. రూ.361.81 కోట్లతో ఈ ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. దాదాపు 780 బోట్లు ఇక్కడ నిలుపుదల చేసి వేట సాగించుకోవచ్చని పేర్కొన్నారు. 48.48 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించినట్లు వివరించారు. 18 నెలల్లో పనులు పూర్తి చేస్తామని చెప్పారు. మత్స్యకారులకు విశ్రాంత భవనాలు, చేపల నిల్వకు కోల్డ్ స్టోరేజీలు, వలలు మరమ్మతులకు ప్రత్యేక గదులు, తాగునీటి సౌకర్యం వంటి అనేక సౌకర్యాలు లభిస్తాయని, ఈ గ్రామానికి జాతీయ స్థాయి గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్ మత్స్యకారుల సంక్షేమానికి ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. 22 మంది పాకిస్తాన్ బందీలైన మత్స్యకారుల విడుదలకు కృషి చేసి, విడుదలైన వారికి రూ. 5 లక్షలు చొప్పున పరిహారం ఇచ్చారని గుర్తు చేశారు. రాయితీపై పరికరాలు కూడా అందిస్తున్నట్లు తెలిపారు.

మత్స్యకారులకు అండగా ప్రభుత్వం: ఎమ్మెల్యే

మత్స్యకారులకు అండగా ప్రభుత్వం ఉందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. ఈ హార్బర్ వల్ల మత్స్యకారులకు వేట మెరుగ్గా సాగి మంచి ఆదాయం వస్తుందన్నారు. ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా అమలు చేస్తోందని తెలిపారు.





జగనన్న ప్లకార్డులతో ఆడ పడుచులు



అభిమాన నాయకుడిని చూసేందుకు..



ప్లకార్డులతో యువతుల ఆనందం

క్లుప్తంగా

డీఈఓగా తిరుమల చైతన్య

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా విద్యాశాఖాధికారిగా వమ్మరవల్లి డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు వెలువరించింది. శ్రీకాకుళం ఉప విద్యాశాఖాధికారిగా కూడా సేవలు అందిస్తున్న తిరుమల చైతన్యను పూర్తి అదనపు బాధ్యతలతో డీఈఓగా నియమించింది. ఈయన ఇదివరకే జిల్లా డీఈఓగా, సమగ్రశిక్ష అభియాన్ పీఓగా పనిచేసిన విషయం విదితమే. ఇప్పటి వరకు డీఈఓగా వ్యవహరించిన గార పగడాలమ్మను టెక్కలి ఉప విద్యాశాఖాధికారిగా నియమించారు. పగడాలమ్మ నుంచి తిరుమల చైతన్య బాధ్యతలు స్వీకరించాల్సి ఉంది.

21న జాబ్‌మేళా

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 21న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కె.ఎస్.శ్రీనివాసరావు బుధవారం చెప్పారు. కడపకు చెందిన షిర్డీసాయి ఎలక్ట్రానిక్స్ సంస్థ నిర్వహించే ఈ ఇంటర్వ్యూలకు ఫిట్టర్, ఎలక్ట్రికల్ ట్రేడుల్లో ఐటీఐ ఉత్తీర్ణులు అర్హులని పేర్కొన్నారు. ప్రారంభంలో నెలకు రూ.12 వేలు వేతనం, భోజన, వసతులు సంస్థ కల్పిస్తుందని చెప్పారు. ఉదయం 10 గంటలకు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని, పూర్తి వివరాలకు 98499 88879 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

టెన్త్ స్పాట్ ప్రారంభం

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో పదో తరగతి జవాబుపత్రాల మూల్యాంకన ప్రక్రియ (స్పాట్ వాల్యుయేషన్) బుధవారం ప్రారంభమైంది. శ్రీకాకుళం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలతోపాటు సమీపంలోని మహాలక్ష్మినగర్ కాలనీలో ఉన్న శ్రీచైతన్య స్కూల్‌లో మూల్యాంకనం జరుగుతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు వారం రోజుల్లో మూల్యాంకనం పూర్తిచేసేలా అధికారులు చర్యలు చేపట్టారు. బాలికోన్నత పాఠశాల కేంద్రంలో తెలుగు, ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ పేపర్లు దిద్దుతున్నారు. శ్రీచైతన్య స్కూల్ కేంద్రంలో గణితం, ఇంగ్లిష్, సోషల్ స్టడీస్, హిందీ పేపర్లను దిద్దుబాటు చేస్తున్నారు. డీఈఓ గార పగడాలమ్మ నేతృత్వంలో అసిస్టెంట్ కమిషనర్ లియాఖత్ ఆలీఖాన్, డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్లు డాక్టర్ తిరుమల చైతన్య, ఆర్.విజయకుమారి, ఏసీఓలు పర్యవేక్షిస్తున్నారు. మూల్యాంకనంలో ఎలాంటి తప్పులకు, అక్రమాలకు తావు లేకుండా పక్కాగా, పారదర్శకంగా వ్యవహరించాలని డీఈఓ పగడాలమ్మ అసిస్టెంట్ ఎగ్జామినర్లకు, సిబ్బందికి సూచించారు.

కణితి కుటుంబానికి పరామర్శ



కణితి విశ్వనాథం చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సోము వీర్రాజు

కాశీబుగ్గ: మాజీ ఎంపీ డాక్టర్ కణితి విశ్వనాథం ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు బుధవారం పరామర్శించారు. కుమార్తె డాక్టర్ శారద, కుమారుడు రాజేంద్రలను కలిసి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కొర్ల కన్నారావు, కొర్రాయి బాలకృష్ణ యాదవ్, పాలవలస వైకుంఠరావు, స్వామి రామానంద, వైశ్యరాజు మోహనరాజు తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై బ్లేడ్‌తో దాడి

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధిలోని ఏఎస్‌పేట వద్ద ఎం.తోటూరుకు చెందిన బోరుబద్ర వెంకటరావుపై ఏఎస్‌పేటకు చెందిన ఉదయపురం మహేష్ అనే వ్యక్తి బ్లేడ్‌తో దాడిచేసి గాయపర్చాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వెంకటరావు, అతని స్నేహితులు కలిసి ద్విచక్రవాహనంపై సుమండి రోడ్డు నుంచి ఇచ్ఛాపురం వైపు వస్తుండగా ఏఎస్‌పేట వద్దకు వచ్చేసరికి రోడ్డుపైన కొంత మంది వ్యక్తుల గొడవపడటంతో బైకులు ఆపారు. ఎందుకు గొడవ పడుతున్నారని ప్రశ్నించగా ఏఎస్‌పేటకు చెందిన మహేష్‌తో పాటు నర్తు మేఘనాథం, నర్తు చిరంజీవులు, దట్టి భగీరథి, మరోవ్యక్తి కలిసి వెంకటరావు, అతని స్నేహితులపై దాడికి దిగారు. మహేష్ బ్లేడ్‌తో దాడి చేయడంతో వెంకటరావు ముఖానికి తీవ్ర గాయమైంది. బాధితుడ్ని వెంటనే స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. వెంకటరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్‌ఐ కె.గోవిందరావు కేసు నమోదుచేశారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	61,150-00
బంగారం(22కి. 10గ్రా.)	56,050-00
వెండి (కిలో)	81,000-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 375.00
విజయనగరం	రూ. 37900
శ్రీకాకుళం	రూ. 379.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹ 210

స్కూల్ ఆటో బోల్తా



కొత్తూరు సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న చిన్నారులు

- ఐదుగురు చిన్నారులకు గాయాలు
- రిమ్స్‌కు ఇద్దరు తరలింపు
- మెట్టూరు వద్ద ఘటన

కొత్తూరు: పాఠశాల నుంచి విద్యార్థులతో ఇంటికి వస్తున్న ఆటోను మరో ఆటో ఢీకొన్న ఘటనలో ఐదుగురు చిన్నారులు గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూరు మండలం ఓంద్రుజోల గ్రామానికి చెందిన విద్యార్థులు పారాపురంలోని ఇమ్మానియల్ ప్రైవేటు స్కూల్, మెట్టూరు హైస్కూల్లో చదువుతున్నారు. వీరిని ఆటోడ్రైవర్ జి.రాజారావు రోజూ తన ఆటోలో స్కూల్‌కు తీసుకెళ్తుండేవాడు. ఎప్పట్లాగే బుధవారం కూడా పాఠశాలల నుంచి ఇళ్లకు తిరిగి వెళ్తుండగా మెట్టూరు వద్ద అలికాం-బత్తిలి రోడ్డులో మరో ఆటో వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో బోల్తాపడటంతో ఇమ్మానియల్ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న శనాపతి ప్రశాంత్, గొర్లె మిథిన్, మెట్టూరు ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కురిగి



ప్రమాదానికి గురైన ఆటో ఇదే



తీవ్రంగా గాయపడిన ఒకటో తరగతి విద్యార్థి మిథిన్

త్రివేణి, పొన్నాన షర్మిల , నవీన్‌లు గాయపడ్డారు. డ్రైవర్, మరో ఇద్దరు విద్యార్థులు ఎటువంటి గాయాలు లేకుండా బయట పడ్డారు. తీవ్రంగా గాయపడిన మిథిన్, నవీన్‌లను మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తరలించారు. మిగిలిన చిన్నారులను 108లో కొత్తూరు సీహెచ్‌సీకి తరలించారు. సూపరింటెండెంట్ డి.కిషోర్, వైద్యాధికారి రామకృష్ణ వైద్యసేవలు అందించారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు ఆస్పత్రికి చేరుకుని పిల్లల పరిస్థితిని చూసి బోరున విలపించారు. మద్యం షాపు రోడ్డువైపు నుంచి వచ్చిన ఓ ఆటో తమను ఢీకొట్టినట్లు డ్రైవర్ జి.రాజారావు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్ బి.సింహాచలంపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ సురేష్ తెలిపారు.



విద్యార్థిని ఆస్పత్రిలో చేర్పిస్తున్న దృశ్యం

విన్నపాలు విన్నారు..

అరసవల్లి/కోటబొమ్మాళి/నందిగాం/ టెక్కలి రూరల్: మూలపేట పోర్టు శంకుస్థాపనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్థానిక ప్రజాప్రతినిధులు వినతి పత్రాలను అందించి సమస్యలు మనవి చేశారు.

- జిల్లాలో క్రషర్ యూనిట్ యజమానుల సమస్యలపై మంత్రి ధర్మాన ప్రసాదరావు సీఎం వైఎస్ జగన్‌కు వినతి పత్రం అందజేశారు.దీనిపై సీఎం సానుకూలంగా స్పందించారు.
- టెక్కలిలో మహిళా డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని, అలాగే పోర్టు నిర్మాణంలో భాగంగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని టెక్కలి జెడ్పీటీసీ దువ్వాడ వాణి కోరారు. మండల పరిషత్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎంపీపీ ఆట్ల సరోజనమ్మ వినతి పత్రం అందజేశారు.
- బీఆర్ అంబేడ్కర్ స్మరణీయ ప్రాంతాలను కలుపుతూ పర్యాటకంగా అభివృద్ధి చేయాలని, ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని ఎస్టీ, ఎస్టీ జిల్లా జేఏసీ కన్వీనర్ కంఠ వేణు కోరారు.
- వంశధార ఎడమ ప్రధాన కాలువ నుంచి సాగు నీరు పలాస మండలం శివారు ప్రాంతాలకు అందించాలని పలాస ఎంపీపీ ఉంగ ప్రవీణ విన్నవించారు.
- రహదారులు, మంచినీటి పథకాలను మంజూరు చేయాలని టెక్కలి మేజర్ పంచాయతీ సర్పంచ్ గొండేల సుజాత మనవి చేశారు.
- ఏనేటి కొండ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలంటూ ఆ కులసంఘ నేతలు మెట్టు వాసు తదితరులు కోరారు.
- కోటబొమ్మాళిలో మసీదు నిర్మాణానికి స్థలం ఇవ్వాలని, అలాగే ముస్లింలకు సాదీఖానాను నిర్మించాలని మండల కోఆప్షన్ సభ్యుడు రంజాన్ రాజుభాయ్ కోరారు.
- కోటబొమ్మాళి మండలంలో పాకివలస, క్రిష్టపురం గ్రామాల వద్ద వంశధార కాలువలపై వంతెనలు నిర్మించాలని రోణంకి మల్లేశ్వరరావు విన్నవించారు.
- శ్రీజగన్నాథపురం గ్రామానికి అభివృద్ధి నిధులు మంజూరు చేయాలని, అలాగే యలమంచిలి-పిన్నింటిపేట గ్రామానికి మధ్య బ్రిడ్జి నిర్మాణానికి ఆ గ్రామ సర్పంచ్ నూక శైలజ కోరారు.
- హరిశ్చంద్రపురం పంచాయతీకి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ గురువెల్లి కేశవరావు కోరారు.
- చిన్నసాన ఎత్తిపోతల పథకానికి మరమ్మతు చేయాలని జెడ్పీటీసీ దుబ్బ వెంకటరావు కోరారు.
- నందిగాం మండలంలో 10 గ్రావెల్ రహదారులను బీటీ రోడ్లుగా మార్చాలని, మండల పరిషత్ నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, అలాగే మండల కేంద్రంలో ఎస్సీ బాలికల హాస్టల్‌ను మంజూరు చేయాలని నందిగాం ఎంపీపీ నడుపూరి శ్రీరామమూర్తి విన్నించారు.
- నందిగాం మండలం హరిదాసుపురంలో వంశధార కాలువ మీద కాలివంతెన నిర్మించాలని స్థానిక నేత కణితి నారాయణ మూర్తి, పెద్దలవునిపల్లిలో కోల్డ్‌స్టోరేజి ఏర్పాటు చేయాలని స్థానిక సర్పంచ్ అట్టాడ శ్రీనివాసరావు, అలాగే వెలుగు కమ్యూనిటీ క్లస్టర్ (సిసి)లను రెగ్యులర్ చేయాలని నామినీ వీఆర్‌ఓలను విధుల్లోకి తీసుకోవాలని కాపుతెంబూరు సర్పంచ్ పోలాకి మోహనరావు విజ్ఞప్తి చేశారు.
- ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నిధులు మంజూరు చేసి ఎస్సీ యువతకు స్వయం ఉపాధి కల్పనకు చర్యలు చేపట్టాలని నందిగాం యువనేత కుర్మాన ఉత్తమ్‌కుమార్ కోరారు.
- నందిగాం మండలం నందిగాం జాతీయ రహదారి నుంచి మాలపేట వరకు, అలాగే పెంటూరు నుంచి రౌతుపురం ఆర్‌ఎస్ వరకు అసంపూర్తి రహదారులను పూర్తి చేయాలని తమిరి ఫల్గుణరావు, చిన్ని జోగారావులు కోరారు.
- మత్స్యకారులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని, ఉమిలాడలో జెట్టీ నిర్మాణం చేయాలని, గరీబుల గెడ్డపై లిఫ్ట్ ఇరిగేషన్ పథకం నిర్మించాలని సంతబొమ్మాళి మండల పార్టీ నేత మేరుగ అప్పారావు విజ్ఞప్తి చేశారు.
- స్థానికంగా కోల్డ్‌స్టోరేజి ఏర్పాటు చేయాలని, అలాగే మత్స్యకారులకు ప్రత్యేక ఆశ్రమ పాఠశాలలను మండలంలోనే ఏర్పాటు చేయాలని పీరుపల్లి రాజశేఖర్ కోరారు.
- సంతబొమ్మాళి మండలం రుంకు హనుమంతుపురం- తంపర బ్రిడ్జి నిర్మానానికి రూ.50 లక్షలు మంజూరు చేయాలని సర్పంచ్ ఎన్ని మన్మథరావు విన్నవించారు.
- నౌపడ కూడలి నుంచి నౌపడ ఆర్‌ఎస్ వరకు రైల్వే ఓవర్ బ్రిడ్జి మంజూరు చేయాలని, నౌపడ పంచాయతీలో మంచినీటి పథకం మంజూరు చేయాలని స్థానిక పీఏసీఎస్ డైరెక్టర్ పిలక రవికుమార్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు.

వైద్యవృత్తిని అంకితభావంతో చేపట్టాలి



వైద్య విద్యార్థులు, ఆస్పత్రి ప్రతినిధులతో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

- డాక్టర్ కావడం నోబెల్‌తో సమానం
- జెమ్స్ విద్యార్థుల పట్టాల ప్రదానోత్సవంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

శ్రీకాకుళం రూరల్/శ్రీకాకుళం/శ్రీకాకుళం కల్చరల్: డాక్టర్ కావడమనేది ప్రఖ్యాత నోబెల్ బహుమతి పొందడంతో సమానమని, ఎంతో గొప్పదైన వైద్య వృత్తిని అంకితభావంతో చేపట్టాలని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. జిల్లా కేంద్రంలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో బుధవారం 2017-23 బ్యాచ్ వైద్య విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగి పుస్తకంతో సమానమని, ప్రతి పేషెంట్ వైద్యునికి ఎంతో జ్ఞానాన్ని అందిస్తారని, ఆ దృష్టితోనే వైద్య సేవలందించాలన్నారు. అవసరం మేరకే మందులు రాయాలని కోరారు. విదేశాలకు వెళ్లి జ్ఞానాన్ని పెంచుకొని తిరిగి మన దేశానికే సేవ చేయాలన్నారు. వ్యాధి వచ్చాక చికిత్స అందించడం కన్నా రోగాల బారిన పడకుండా ప్రజలను చైతన్యపరచాలన్నారు.యువత రాజకీయాల్లోకి వచ్చి వ్యవస్థలను బాగుచేయాలే తప్ప అవినీతి రాజకీయాల్లో భాగస్వామ్యం కాకూడదన్నారు. జెమ్స్‌లో అందిస్తున్న సేవలు గొప్పవని కొనియాడారు. సీఎండీ, కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్ చైర్మన్ బొల్లినేని భాస్కరరావు మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్య ఉన్నత శిఖరాల వైపు తీసుకెళ్తుందన్నారు. కార్యక్రమంలో జెమ్స్ వైద్యులు డాక్టర్ సుధీర్, ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మిలలిత, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, సీఈఓ బొల్లినేని ఆద్విక్, సీఏఓ స్వర్ణ, రామ్మోహన్, కిమ్స్ వైద్యులు గూడేన సోమేశ్వరరావు, ఆర్ఎంఓ ప్రవీణ్‌కుమార్, బాలమురళీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం డేఅండ్‌నైట్ జంక్షన్‌లో ఎన్‌జీ రంగా, సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహాలకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంతకుముందు శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు తన నివాసంలో తేనీటి విందు ఏర్పాటు చేశారు. శిష్ట కరణాలను ఓబీసీల్లో చేర్పించేందుకు కృషి చేయాలని సంఘ నాయకులు పోలుమహంతి ఉమామహేశ్వరరావు, శ్రీనివాస పట్నాయక్ వినతిపత్రం సమర్పించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాంతాకల్యాణ అనురాగ నిలయాన్ని వెంకయ్యనాయుడు సందర్శించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు సేవా కార్యక్రమాలను వివరించారు.

యువకుడు ఆత్మహత్య



వరిసి వినోద్(ఫైల్)

మెళియాపుట్టి: మండలంలోని కొసమాల గ్రామంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొసమాలకు చెందిన వరిసి ఆనందరావు, కృష్ణవేణి భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమారులు వరిసి జ్యోతేశ్వరరావు, వినోద్ (27). కృష్ణవేణి తల్లి హైదరాబాద్‌లో మృతిచెందడంతో ఆమెను కడసారి చూసేందుకు ఆనందరావు దంపతులు సోమవారం అక్కడికి వెళ్లారు. ఇంతలో ఏం జరిగిందో గానీ వినోద్ బుధవారం వేకువజామున ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతిచెందాడు. ఉదయం ఏడు గంటల సమయంలో సోదరుడు గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. కుటుంబ కలహాల నేపథ్యంలోనే మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు చెబుతున్నారు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పాతపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అందొచ్చిన కొడుకు మృతి చెందాడన్న సమాచారం తెలుసుకుని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

రైలు ఢీకొని మహిళ మృతి

పొందూరు: పొందూరు-దూసి రైల్వే స్టేషన్ల మధ్య గోరింట గ్రామ సమీపంలో విశాఖ-పలాస ప్యాసింజర్ రైలు కిందపడి బుధవారం గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు జీఆర్‌పీ ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. మృతురాలి వయసు సుమారు 50 ఏళ్లు ఉంటుందని, శరీరం నుజ్జయిపోవడంతో గుర్తు పట్టలేని విధంగా మారిందని చెప్పారు. కుంకుమ రంగు చీర ధరించి, సగం జుట్టుతో ఉన్నట్లు తెలిపారు. వివరాలు తెలిసిన వారు 70132 73731 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సీనియర్ సివిల్ జడ్జిలు బదిలీ

గుంటూరు లీగల్: రాష్ట్ర వ్యాప్తంగా 40 మంది సీనియర్ సివిల్ జడ్జీలను బదిలీ చేస్తూ ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ (విజిలెన్స్) సునీత బుధవారం ఉత్తర్వులిచ్చారు. శ్రీకాకుళం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కె.నాగమణిని విజయనగరం డీఎల్‌ఎస్‌ఏ సెక్రటరీగా, విజయనగరం సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావును సోంపేట సీనియర్ సివిల్ జడ్జిగా, టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి టి.హరితను గూటీ సీనియర్ సివిల్ జడ్జిగా నియమించారు. మే 2వ తేదీలోపు న్యాయమూర్తులు విధుల్లో చేరాలని పేర్కొన్నారు.

గ్రామాల ప్రగతికి కృషి చేయాలి



మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు సేవా దృక్పథం అలవరుచుకోవాలని, గ్రామీణ ప్రాంత ప్రగతికి కృషి చేయాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల యూనిట్-7 విద్యార్థులు ఈ నెల 26 వరకు నిర్వహించనున్న జాతీయ సేవా ప్రత్యేక శిబిరాన్ని ఎచ్చెర్లలో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సర్వేలు గ్రామాల ప్రగతికి దోహదపడతాయన్నారు. విద్యాహక్కు చట్టం, బాలకార్మిక వ్యవస్థపై చైతన్యం, పారిశుద్ధ్యం, పచ్చదనం- పరిశుభ్రత వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రజా భాగస్వామ్యంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అడ్డయ్య, జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎం.అనూరాధ, ప్రోగ్రాం అధికారి తొత్తడి భవాని, వై.మౌళీశ్వరరావు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

శభాష్ పోలీస్!

- రైల్వేట్రాక్‌పై వ్యక్తి ఆత్మహత్యాయత్నం
- కాపాడి కౌన్సిలింగ్ ఇచ్చిన ఎస్ఐ



రవికుమార్‌తో మాట్లాడుతున్న ఎస్ఐ బాలరాజు

సోంపేట : ఎస్ఐ సమయస్ఫూర్తి ఓ ప్రాణాన్ని రక్షించింది. ఆత్మహత్యకు ప్రయత్నించిన వ్యక్తిని సోంపేట ఎస్ఐ ఎస్.బాలరాజు కాపాడి ఆదర్శంగా నిలిచారు. మూలపేటలో బుధవారం సీఎం బందోబస్తు ముగించుకుని ఎస్ఐ బాలరాజు తిరిగి వస్తుండగా సోంపేట ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద రైల్వే ట్రాక్‌పై ఎవరో వ్యక్తి పడుకున్నట్లు గమనించారు. వెంటనే జీపు ఆపి వ్యక్తిని కాపాడి బయటకు లాగారు. కాసేపు మాట్లాడి ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. తన పేరు సీహెచ్ రవికుమార్ అని, పలాసలో ఉంటున్నట్లు చెప్పాడు. కుటుంబ కలహాల వల్ల ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తెలియజేయగా ఎస్ఐ.. రవికుమార్ స్నేహితుడు జగదీశ్‌ను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. చనిపోతే కుటుంబానికి కలిగే నష్టాలు వివరించి తిరిగి పలాస పంపించారు. రవికుమార్ ప్రాణాన్ని కాపాడిన ఎస్ఐను స్నేహితులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

గురుకుల పాఠశాల సిబ్బందికి షోకాజ్ నోటీసులు

మెళియాపుట్టి: ఇటీవల మండలంలోని పెద్దమడి గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. దీనికి సంబంధించి ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, మరో ఐదుగురు ఉపాధ్యాయులకు ఐటీడీఏ పీఓ బుధవారం షోకాజ్ నోటీసు జారీ చేశారు.

పీజీ రెండో సెమిస్టర్ ఫలితాలు వెల్లడి

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలకు సంబంధించి పోస్టు గ్రాడ్యుయేషన్ రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదల చేసినట్లు ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ బుధవారం చెప్పారు. ఫలితాలు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. మార్కుల జాబితాలు కళాశాలలకు అందజేస్తామని, రీ వాల్యుయేషన్ కోరుకునే విద్యార్థులు 15 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్పెషల్ బీఎడ్ మెంటల్లీ రిటార్డ్‌లో 28 మందికి 28 మంది, జర్నలిజంలో ముగ్గురు, మూడేళ్ల లా కోర్సులో 108 మందికి 97 మంది, ఎకనామిక్స్‌లో ఐదుగురు, రూరల్ డెవలప్‌మెంట్‌లో ఇద్దరికి ఇద్దరు, సోషల్ వర్కులో ఆరుగురు, తెలుగులో ఏడుగురు, ఎంబీఏలో 46 మంది, ఎంకాంలో 23 మంది, ఎంఈడీలో 28 మంది, ఎంఎల్ఐఎస్సీలో తొమ్మిది మందికి 9 మంది, ఐదేళ్ల లా కోర్సులో 20 మందికి 18 మంది, డీపీఈలో 27 మందికి 26 మంది, ఎంహెచ్‌ఏలో 44 మందికి 35 మంది, ఎంసీఏలో 46 మందికి 32 మంది, ఎనలాటికల్ కెమిస్ట్రీలో 53 మందికి 50 మంది, బయోటెక్నాలజీలో 29 మందికి 27 మంది, ఫిజిక్స్‌లో 22 మందికి 19 మంది, ఆర్గానిక్ కెమిస్ట్రీలో 143 మందికి 119 మంది, గణితంలో 20 మందికి 18 మంది, యోగాలో 14 మందికి 13 మంది, జువాలజీలో ఏడుగురికి ఏడుగురు, మైక్రో బయోలజీలో 19 మంది, కంప్యూటర్ సైన్స్‌లో 11 మందికి 9 మంది, అప్లెడ్ మ్యాథ్స్‌లో నలుగురికి ముగ్గురు ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు.

'ఎలక్ట్రికల్' షాక్!



కాలిపోయిన గోడలను జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం



కాలిబూడిదైన ఎలక్ట్రికల్ బైకులు



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలోని 14వ వార్డు భగవతీ థియేటర్ ఎదురుగా బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు దుకాణాలు దగ్ధమయ్యాయి. పెయింట్ షోరూంలో మంటలు చెలరేగి పక్కనే ఉన్న ఎలక్ట్రికల్ బైకుల షోరూంకు అంటుకోవడంతో 90 బైకులు, మూడు ఆటోలు కాలిబూడిదయ్యాయి. పక్కనే ఉన్న ప్రభుత్వ వైన్‌షాప్‌కు సైతం మంటలు అంటుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది మూడు గంటల పాటు శ్రమించి మంటలు అదుపులోకి తీసుకొచ్చారు.

– పలాస